28

# ఆత్మవిమర్శప్రదాత శ్రీశేషుదేవులు

శ్రీ శేషుబాబు గారిచే విమర్శింపబడి ఆత్మవిమర్శ దానమును పొందిన వారందరు తమ దేహ, మనో, ఆత్మ మాలిన్యములన్నింటినీ తామే ఆత్మవిమర్శ చేసుకున్నవారు పొందేటటువంటి ఆత్మలాభమును వారు కూడా పొందేవారు. వారిలో దేవతాశక్తులు అభివృద్ధి చెంది సత్యఆతృత, గురుభక్తి, సత్కర్మాచరణ మొదలగునవి వారికి అలవడేవి. ఏ విధమైన సత్యసాధన లేకుండానే శ్రీ గురుదేవుల విమర్శ వలన సత్యమార్గములో పయనించేవారు. కానీ మనిషి సహజముగా తాను ఏయే అభిమానములను ఏయే వ్యామోహములను కలిగియుంటాడో వాటన్నింటికీ తాను అతీతముగా ఉన్నట్లుగా ముసుగు వేసుకుంటూ తనను తాను మభ్య పెట్టుకుంటూ సంతృప్తి చెందుతూ ఉంటాడు. శ్రీ గురుదేవులు విమర్శ అనే ఖడ్గముతో మనిషిలోని నిజస్థితిని అతని కళ్ళముందు నగ్నముగా నిలబెట్టేవారు. మనిషికి నిజముగా తనలోపల ఉన్న మనిషిని చూచుకోవడానికి సిగ్గుగాను, అసహ్యముగాను ఉంటుంది. దానిని అంగీకరించుటకు మనస్కరించదు. అయితే మనిషి తన నిజస్థితిని గ్రహించి అంగీకరిస్తేనే సత్యమార్గంలో పయనించగలుగుతాడు, ఆత్మాభివృద్ధిని పొందగలుగుతాడు. శిష్యులను సత్యమార్గములో పయనింపచేయుటకే శ్రీ గురుదేవులు విమర్శతో వారిలోని మాలిన్యములను కడిగివేసి, పరిశుద్ధపరచేవారు.

గురువిమర్శను స్వీకరించలేక ఎవరైనా ఆయనపై దుష్ప్రచారము చేస్తున్నాగానీ దానిని ఎదుర్కోవడానికి శ్రీ శేషుగారు ఏ ప్రయత్నము చేసేవారు కాదు. భగవంతుని నమ్ముకుని ఎవరికీ అపకారము చేయకుండా సాధుజీవితము జీవిస్తున్నప్పటికీ అందరూ తనను ద్వేషిస్తున్నాగానీ ఓర్పుతో సహించేవారు. ఎంత అవమానము ఎంత దురదృష్టము ఎదురగుచున్నా గానీ ఆయనలో భగవంతుని యెడల గల విశ్వాసము మరింత పెరిగేదే గానీ అణుమాత్రమైనా తగ్గేదికాదు. తన పాపము వలననే తనకు అవమానము కలుగుచున్నదని భావించేవారు. తనలో లేని చెడ్డను తనలో ఉన్నట్లుగా ప్రచారము చేస్తున్నాగానీ, అందువలన నిజముగా తనలో ఉన్న చెడు వేగముగా నశించి పోతుందని భావించేవారు. భగవంతుడే తన పాపాన్ని క్షమించి రక్షిస్తారనే నమ్మకముతో ఎక్కువ కాలము ప్రార్థనలో నిమగ్నమైయుండేవారు.

continue..

గౌరవప్రదమైన స్థానమును మనకు కలిగించినాడు. శేషులాంటి మంచి స్నేహితుడు దొరుకుట చాలా కష్టమురా. అటువంటి వాని గురించి నీవు అబద్ధాలు సృష్టించి, చెడుగా ప్రచారము చేయుట చాలా తప్పురా' అని చెప్పుచుండేవాడు. కానీ నేను ఆ మాటలు వినిపించుకోలేదు. దాని ఫలితము ఇప్పుడు అనుభవించుచున్నాను తెలివితేటలే గొప్పవి అనుకున్నాను కానీ నా సంసారములో నేనిప్పుడు తెలివితేటలతో పరిష్కరించుకోలేనటువంటి సమస్యలను అశాంతిని ఎదుర్కొంటూ నరకమును అనుభవించుచున్నాను. నా మేధావితనం వలన నీవు భయపడి పారిపోయావు అనుకుని గర్వించినాను. కానీ నువ్వే గెలిచినావని నేనే ఓడిపోయినాననే సత్యము చాన్నాళ్ళ తరువాత నాకు అర్ధమయినది. శేషూ నన్ను క్షమించు, నా కొరకు ప్రభువును ప్రార్ధించు" అని వేడుకొనినారు. శ్రీ శేషుబాబు గారు మాత్రము ఎన్నడూ నారాయణను ద్వేషించలేదు. నారాయణ మాటల వలన సంఘ సభ్యులు అభ్యంతర భావములకు లోబడరాదనే ఉద్దేశ్యముతో అందరినీ ఆయనకు దూరముగా ఉంచినారే గానీ ఆయనపై ద్వేషభావము ఎన్నడూ వహించలేదు. శత్రువునైనాగానీ ఎల్లప్పుడూ ప్రేమిస్తూ వారి కొరకు ప్రార్ధన చేసే ప్రేమమూర్తి శ్రీ శేషుబాబు గారు.

